చేపల మార్కెట్ నిర్మాణమయ్యేనా?

- బహిరంగ ప్రదేశంలో అమ్మకాలు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు
- పట్టించుకోని మత్స్య శాఖ
- వసతులు కల్పించని మున్సిపాలిటీ



యనమలకుదురులో మండుటెండలోనే చేపలు విక్రయిస్తున్న దృశ్యం



బహిరంగ ప్రాంతంలో చేపల అమ్మకాలు

పెనమలూరు: కూటమి ప్రభుత్వం చిరు వ్యాపారులకు కనీస వసతులు కల్పించటంలో విఫలమవుతుంది. యనమలకుదురులో చేపల మార్కెట్ నిర్మాణం విషయంలో చర్యలు కూడా తీసుకోవటం లేదు. తాడిగడప మున్సిపాలిటీ, మత్స్యశాఖ చేపల వ్యాపారులకు వసతులు కల్పించటంలో విఫలమయ్యారు. యనమలకుదురులో చేపల మార్కెట్ ఉంది. ఇక్కడ చేపలు అమ్ముకునే చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అలాగే చేపల అమ్మకాలు కూడా పెద్ద ఎత్తున జరుగుతాయి. గ్రామంలోని కృష్ణానదిలో పట్టిన చేపలతో పాటు మచిలీపట్నం, కైకలూరు, తదితర ప్రాంతాల నుంచి చేపలు తీసుకొచ్చి యనమలకుదురులో వ్యాపారులు విక్రయిస్తారు. అయితే చేపల మార్కెట్ నిర్మాణం చేయక పోవటంతో వ్యాపారులతో పాటు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

లాకు సెంటర్‌లో విక్రయాలు....

గ్రామంలో చేపల మార్కెట్ లేకపోవటంతో చేపల వ్యాపారులు లాకు సెంటర్‌లో బహిరంగ ప్రదేశంలో చేపల విక్రయాలు చేస్తున్నారు. చేపల మార్కెట్‌లో అన్ని రకాల చేపలు అందుబాటులో ఉంటున్నాయి. బొచ్చ, రాగండి, మేమ, కొర్రమేను, పండుకప్ప, రొయ్యలు, పీతలు ఇలా పలు రకాల చేపలు విక్రయిస్తున్నారు. చేపల మార్కెట్‌కు శాశ్వత భవనం లేక పోవటంతో మండు టెండలోనే వ్యాపారులు చేపల వ్యాపారం కొనసాగిస్తున్నారు. చేపలు కొనే వారు కూడా చేపల మార్కెట్ వసతి లేక పోవటంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు.

అపరిశుభ్ర పరిస్థితులు...

చేపల మార్కెట్ లేక పోవటంతో లాకు సెంటర్‌లో ఆరు బయట చేపల వ్యాపారం చేయటంతో అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చేపలు శుభ్రం చేసిన తరువాత వ్యర్థాలు అక్కడే వదిలేయటంతో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. ప్రధానంగా ఆదివారం వచ్చిందంటే చేపల మార్కెట్ కిటకిటలాడుతుంది. చేపలు కొనే వారు ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికే రావటంతో భారీగా వ్యాపారం జరుగుతుంది.

చర్యలు చేపట్టాలని వినతి....

చేపల మార్కెట్‌కు శాశ్వత భవనాల నిర్మాణం చాలా అవసరమని గ్రామస్తులు తెలుపుతున్నారు. విజయవాడ వంటి నగరంలోనే అనేక ప్రాంతాల్లో చేపల మార్కెట్‌లు ఉన్నాయని, తాడిగడప మున్సిపాలిటీలో ఎందుకు చేపల మార్కెట్‌కు భవనాలు ఎందుకు చేయరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తే పరిశుభ్రమైన వాతావరణం ఉంటుందని తెలుపుతున్నారు. ఇప్పుడు ఆరుబయట చేపల విక్రయాలు చేయటం వలన వ్యాధులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల మార్కెట్ నిర్మాణం పై మత్స్య శాఖ, మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టాలని మత్స్యకారులు, చేపల వ్యాపారులు కోరుతున్నారు.

చేపల మార్కెట్ అవసరం



యనమలకుదురులో చేపల విక్రయాలు ఎక్కువగా ఉన్నందున శాశ్వతంగా మార్కెట్ ఏర్పాటు చేయాలి. మార్కెట్ వసతి లేకపోవటంతో అందరం ఇబ్బందులు పడుతున్నాము. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

–శాంతమ్మ, చేపల వ్యాపారి, యనమలకుదురు

క్లుప్తంగా

పాతపాడు ఎలిమెంటరీ స్కూల్ తనిఖీ



పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామంలో మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్‌ను మండల విద్యాశాఖాధికారి ఎ. వెంకటరత్నం గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డుల నిర్వహణ, తదితర అంశాలు పరిశీలించారు. 3, 4 తరగతుల్లో కొంత మంది విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల విషయంలో వెనుకబడి ఉన్నారు. వారిని పూర్తి స్థాయిలో సాధన చేయించి రాబోవు 20 రోజుల్లో తగిన అభ్యసనాస్థాయిలోకి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చాలని సూచించారు.

ఆహార నియమాలు పాటించాలి

పెనమలూరు: ఊబకాయం తగ్గించుకోవటానికి ఆహార నియమాలు పాటించాలని సచివాలయ కార్యదర్శి ఆర్.భార్గవి తెలిపారు. వణుకూరు గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా గురువారం ఊబకాయం వలన జరిగే నష్టం పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆహారంలో చక్కెర, నూనె, కొవ్వు తీసుకోకూడదన్నారు. ఈ పదార్థాల కారణంగా ఊబకాయం వస్తుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో రాగి లడ్డు, ఆకు కూరలు, మునగాకు లడ్డు, చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, పాల్గొన్నారు.

నీట మునిగిన ముస్తాబాద హైస్కూల్ ఆవరణ



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం నీట మునిగింది. ఇటీవల వర్షాలకు పెద్ద చెరువుకు నీరు రావడంతో హైస్కూల్ స్థలం నీటిలో మునిగిపోయింది. దీంతో హైస్కూల్‌కు తూర్పు వైపు గేటును మూసివేశారు. దక్షిణం వైపు ఉన్న మార్గం ద్వారా రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలలో 250 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ఆవరణ సర్వే నిర్వహించి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలను ఆనుకుని చెరువు ఉండటంతో ఏటా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త బిల్డింగ్ సమీపంలోని నీరు వచ్చి చేరింది. విద్యార్థుల రక్షణపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముగిసిన ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఆటల పోటీలు గురువారం ముగిశాయి. చివరి రోజున బాల, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు అండర్-14, 17 విభాగాల్లో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్ స్థాయి పోటీల్లో గన్నవరం మండలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని మండల క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఎస్. వెంకటేశ్వరరావు, ఎస్‌కె. మీరాసాహెబ్, సిహెచ్. బాలకృష్ణ, చంద్రశేఖర్, కె.గీత, టాన్యగిరి, కె.విజయకుమారి, బి.శాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ స్టిక్స్ పంపిణీ

పెనమలూరు: కానూరు ఇండియన్ ఓం కార్యాలయంలో గురువారం హెల్త్ కేర్ స్టిక్స్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆక్యుపంక్చర్ వైద్యుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ లయన వరల్డ్ సర్వీసెస్ డే భాగంగా హెల్త్ స్టిక్స్ పంపిణీ చేశామన్నారు. ఈ హెల్త్ స్టిక్స్ దేశ ప్రధాని మోదీ ఉపయోగించి ఫిట్‌నెస్ సాధించారని తెలిపారు. వీటి ద్వారా అరచేతిలో ఉండే ప్రెజర్ పాయింట్స్ స్పందన బాగుండి ఆరోగ్యంగా జీవించగలుగుతారని చెప్పారు. సమితి సభ్యులు కొండవీటి సుమతి, నాగమణి, రియాజ్ అహ్మద్, విఠల్, పలువురు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



కంకిపాడు: దీపావళి టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సీఐ జె.మురళీకృష్ణ తెలిపారు. ఉయ్యూరు రూరల్, కంకిపాడు పోలీసుస్టేషన్ పరిధిలో దీపావళి టపాసులు విక్రయ దుకాణదారులకు గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అనధికారికంగా బాణసంచా నిల్వచేయటం, రవాణా చేయటం నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదనపు ఎస్ఐ తాతాచార్యులు, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో కలుషిత నీరు

పెనమలూరు: చోడవరం గ్రామంలో కలుషిత నీరు కుళాయిల్లో రావటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో పంచాయతీ తాగునీరు పైప్‌లైన్ గత కొద్ది రోజులుగా శివాలయం వద్ద లీక్ అవుతుంది. పైప్‌లైన్ డ్రెయినేజీలో ఉండటంతో కలుషిత నీరుఏ పైప్‌ల ద్వారా కుళాయిల్లో సరఫరా జరుగుతుంది. పైప్‌లైన్ మరమ్మతులు చేయాలని కోరుతున్నా పంచాయతీ పాలకులు స్పందించటం లేదని ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ నీరు కలవటం వలన తాగునీరు దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. డయేరియా ప్రబలక ముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మేకిన్ ఇండియాకు అందరి సహకారం కావాలి



కానూరులో విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందచేస్తున్న గ్రీప్

పెనమలూరు: మేకిన్ ఇండియాకు అందరూ తమ వంతు సహకారం అందించాలని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రీప్ అన్నారు. కానూరు సిద్ధార్థ హయ్యర్ ఎడ్యూకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో గురువారం వ్యవస్థాపక అవకాశాలు, ఖాదీ గ్రామీణ పరిశ్రమ అభివృద్ధి పై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులు వాడుకోవాలన్నారు. దేశ ప్రగతికి, మేకిన్ ఇండియాకు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాలకు తమ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఈ సందర్భంగా వ్యాసరచన, ఇతర పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఖాదీ స్వదేశీ ఉత్పత్తులు వాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్లు ఎ.ఆనంద్, ఆర్ఎల్ఎస్.మూర్తి, ఉపకులపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షన్ పథకంపై అవగాహన

విజయవాడరూరల్: దేశ పౌరులకు వృద్ధాప్యంలో భద్రతను కల్పించేందుకు పెన్షన్ సమాజాన్ని నిర్మించేందుకు అమలు చేస్తున్న అటల్ పెన్షన్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్ సీవీఎస్ భాస్కరరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఎస్ఎల్‌బీసీ, పీఎఫ్ఆర్‌డీఏ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఈ పథకంలో 18-40 ఏళ్ల వయస్సున్న వారు చేరవచ్చని చెప్పారు. 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.1000 నుంచి 5000 వరకు పెన్షన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పేరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్యాంకుల ప్రదర్శన ప్రశంసనీయమని తెలిపారు. ఉత్తమ ప్రదర్శన కనబరచిన బ్రాంచ్ మేనేజర్లు, ఎల్‌డీఎంలు, బ్యాంక్ మిత్రలను సత్కరించారు. ఎస్ఎల్‌బీసీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎల్‌డీఎం కె. ప్రియాంకతో పాటు ఆర్‌బీఐ, పీఎఫ్ఆర్‌డీఏ, నాబార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం



యనమలకుదురులో నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు, కార్యకర్తలు

పెనమలూరు: మహిళల హక్కులు కాపాడుకోవటానికి పోరాటం చేస్తామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల అధ్యక్షురాలు షేక్.వలిబి అన్నారు. ఐద్వా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం యనమలకుదురు వీఎల్ భవన్, 1వ వార్డులో జెండాను ఆవిష్కరించి వలిబి ప్రసంగించారు. మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు రాత్రి సమయాల్లో పని చేయటానికి ప్రభుత్వం చట్ట సవరణ చేయటం దారుణమన్నారు. మహిళకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళణ వ్యక్తం చేశారు. మహిళల హక్కుల కోసం రానున్న రోజుల్లో పోరాటం చేపడతామని తెలిపారు. యనమలకుదురులో మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ ఉచితంగా ఇస్తున్నామన్నారు. మహిళలు ఐక్యత్యంతో ఉండి హక్కుల సాధనకు ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్‌బి, వాణి, శ్రీదేవి, బాజాన్‌బి, నూర్జహాన్, సుశీల పలువురు మహిళలు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మరణం తీరనిలోటు



మాట్లాడుతున్న అనగాని రవి

గన్నవరం: చింతపల్లి పాపారావు స్మారక భవనంలో గురువారం సీపీఎం నాయకులు నెక్కలపు శ్రీనివాసరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనగాని మాట్లాడుతూ జర్నలిస్ట్‌గా, కమ్యూనిస్టుగా శ్రీనివాసరావు ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన అకాల మరణం సీపీఎంకు, ప్రజాశక్తికి తీరని లోటని చెప్పారు. నిరంతరం ప్రజల పక్షాన నిలిచిన శ్రీనివాసరావు పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు సీపీఎం నేతలు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్ని రకాల అండగా నిలుస్తుందన్నారు. ప్రజాశక్తి ఉమ్మడి కృష్ణా కన్వీనర్ ఎంబీ. నాథన్, సీపీఎం నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణ స్వామి, సూరగాని సాంబశివరావు, సీపీఐ నేత కొండా వీరాస్వామి, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరంకిలో రోడ్డుకు శంకుస్థాపన

పెనమలూరు: పోరంకిలో కృష్ణవేణి స్కూల్ సమీపంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి రూ 23.50 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో అంతర్గత రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్. నజీర్, టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

కొత్త జీఎస్టీ రేట్లకే మందులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 రేట్ల ప్రకారమే మందులు, వైద్య పరికరాల విక్రయాలు సాగించాలంటూ బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో ఫణికుమార్ తెలిపారు. స్థానిక మహత్మగాంధీనగర్‌లోని పీహెచ్‌సీ ప్రాంగణంలో ఎహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా 12, 28 శాతం శ్లాబు పన్నులను పూర్తిగా తొలగించారని, అన్ని రకాల వస్తువులపై 5 లేదా 12 శాతం మాత్రమే జీఎస్టీ అమలవుతుందని చెప్పారు. దీనికి అనుగుణంగా మెడిసిన్స్‌పై ఎమ్మార్పీ తగ్గుతాయని పేర్కొన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. అనంతరం ప్రతి మెడికల్‌షాపునకు తిరుగుతూ వర్తకులకు కరపత్రాలు పంపిణీ చేశారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)పై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలకు అనుగుణంగా వ్యాపారులు నడుకోవాలని సూచించారు.

స్కూల్ గేమ్స్ ఓవరాల్ చాంపియన్ పెనమలూరు



పెనమలూరులో క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందచేసిన దృశ్యం

పెనమలూరు: మండల స్థాయిలో గత మూడు రోజులుగా జరిగిన స్కూల్ గేమ్స్‌లో ఓవరాల్ చాంపియన్ పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాల నిలిచింది. హెచ్ఎం సుధారాణి గురువారం వివరాలు తెలుపుతూ స్కూల్ గేమ్స్ పెనమలూరు పాఠశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. అండర్ 14, 17 బాలబాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, చెస్ తదితర పోటీలు నిర్వహించగా 210 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఓవరాల్ చాంపియన్‌గా పెనమలూరు పాఠశాల గెలిచిందని చెప్పారు. కాగా గెలుపొందిన క్రీడాకారులకు దాత కిలారు శివకుమార్ సర్టిఫికెట్లు అందచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిలారు బసవపున్నయ్య, సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఏపీరాజు, టి.విజయలక్ష్మి, ఎం.శేషగిరిరావు, డీవీ.సుబ్బారావు పలువురు పాల్గొన్నారు. త్వరలో నియోజకవర్గ స్థాయి పోటీలు ఉయ్యూరులో జరుగుతాయన్నారు.

చెత్త కుప్పల తొలగింపు

సాక్షి స్పందన



బుడమేరు వంతెన వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బుడమేరు కాలువ వద్ద గుట్టలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను గురువారం అధికారులు తొలగించారు. ఈ నెల 8న సాక్షిలో బుడమేరుపై వంతెన నిర్మించండి కథనంలో భాగంగా వంతెన వద్ద అనధికారికంగా చేస్తున్న చెత్త డంపింగ్‌పై కథనం ప్రచురితమైంది. నివాసాల మధ్య చెత్త డంపింగ్‌తో పరిసర ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త కుప్పల ఫలితంగా తీవ్ర దుర్వాసనతో పాటు విషసర్పాలు, దోమలు విజృంభిస్తున్నాయని అధికారులకు తెలియజెప్పింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు పారిశుద్ధ్య సిబ్బందిచే కుప్పలుగా పేరుకపోయిన చెత్తను తొలగించారు. పొక్లెయిన్ సహాయంతో చెత్తను ఎత్తించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. వ్యర్థాలకు నిప్పు పెట్టి తగులపెట్టారు. సాక్షి చొరవతో చెత్త సమస్య పరిష్కారమవుతున్నందుకు ఈ ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే బుడమేరు కాలువపై కూల్చేసిన వంతెన స్థానంలో కొత్త వంతెన కూడా నిర్మించి కాల్వగట్టు ప్రాంతవాసుల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

నున్న(విజయవాడరూరల్): రైతులు కష్టపడి పండించిన పంటలను ఎలుకల నుంచి కాపాడుకునేందుకు అందచేస్తున్న ఎలుకల నిర్మూలన మందును అందరూ సద్వినియోగం చేసుకోవాలని నున్న సొసైటీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నున్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఎలుకల నిర్మూలన మందు ప్యాకెట్లను రైతులకు అందచేశారు. తొలుత వ్యవసాయ సిబ్బంది ఎలుకల మందును పంట పొలాల్లో ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు.

గంగూరులో హడలెత్తిస్తున్న చెత్త ట్రాక్టర్



పెనమలూరు: గంగూరు గ్రామపంచాయతీలో చెత్త తరలించే ట్రాక్టర్ గ్రామ ప్రజలను హడలెత్తిస్తుంది. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగి ట్రాక్టర్‌తో హల్‌చల్ చేయటంతో పారిశుద్ధ్య కార్మికులు సైతం ట్రాక్టర్ పై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జోషి కొద్ది కాలంగా పని చేస్తున్నాడు. ఆయన రోజూ మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. కాగా గురువారం పూటుగా మద్యం సేవించి విధులకు వచ్చాడు. దీంతో కార్మికులు భయంతో ట్రాక్టర్ పై డ్యూటీకి వెళ్ల లేదు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ హడావుడి చేసి ట్రాక్టర్ రోడ్డు పైనే నిలిపాడు. గ్రామస్తులు డ్రైవర్ నిర్వాకం పై వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశారు.

గ్రామాల్లో బాణసంచా గోడౌన్‌లు తనిఖీ



పురుషోత్తపట్నంలో బాణసంచా గోడౌన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు శివయ్య, ఎస్ఐ

గన్నవరంరూరల్: బాణసంచా హోల్‌సేల్ విక్రయదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని తహసీల్దార్ కేవీ శివయ్య హెచ్చరించారు. మండలంలోని పురుషోత్తపట్నం, బీబీగూడెం గ్రామాల్లో ఉన్న బాణసంచా గోడౌన్‌లను గురువారం పోలీస్, ఫైర్ అధికారులతో కలసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని చెప్పారు. ఎక్స్‌ప్లోజివ్ శాఖ నిర్దేశించిన ప్రమాణాలు నిర్వహించాలన్నారు. గోడౌన్‌లలో పని చేస్తున్న వారి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అక్రమ నిల్వలు చేయవద్దన్నారు. పురుషోత్తపట్నంలో కొత్తగా నిర్మించిన గోడౌన్ ప్రమాణాలు పరిశీలించారు. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్ఐ పి.కిషోర్, అగ్నిమాపక అధికారి షేక్ జాన్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలు నిలుపుదల చేశాం

ఉయ్యూరు: 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీ, ఈబీసీ, కాపు సామాజిక వర్గాలకు 50 శాతం రాయితీపై అందించే రుణాలు ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసిందని జిల్లా వెనుకబడిన తరగతుల సేవాసహకార సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రాజేంద్రబాబు తెలిపారు. రుణాలు మంజూరులో జాప్యంపై యుఎఫ్ ఆర్‌టీఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టరు ఆదేశాలతో బీసీ కార్పొరేషన్ కార్యాలయ అధికారి నాగవెంకట ప్రసాద్ విచారణ జరిపి సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. ఈ నివేదికపై ఈడీ రాజేంద్రబాబు యుఎఫ్ ఆర్‌టీఐ రాష్ట్ర కో కన్వీనర్‌కు లిఖిత పూర్వకంగా లేఖ రాశారు. సబ్సిడీ రుణాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలు ప్రక్రియను ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. 2024-25కు సంబంధించిన ప్రణాళిక అమలు విషయమై నిర్ణయం రాగానే లబ్ధిదారులకు రుణాలిస్తామన్నారు.

గాయపడిన మహిళ మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...గుంటూరు జిల్లా తాడేపల్లి గ్రామానికి చెందిన పాతూరి మరియమ్మ (55), నాగరాజు భార్యాభర్తలు. గత నెల 27న గొడవర్రు గ్రామంలో బంధువులు ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈడుపుగల్లు సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం ఢీకొంది. ఘటనలో మరియమ్మ ప్రమాదవశాత్తూ కిందపడి గాయాలపాలైంది. బాధితురాలిని హుటాహుటిన మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ఎస్ఆర్‌ఐకి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

26న గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

గన్నవరం: ఈ నెల 26వ తేదీన గన్నవరంలో ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్రాపు పోలినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.